సాక్షి
చిత్తూరు

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు.
- IIలో



శాస్త్రోక్తంగా రథసప్తమి
వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి శాస్త్రోక్తంగా నిర్వహించారు.
- IIలో



వలంటీర్ల సేవలకు సత్కారం
వలంటీర్లకు వందనం కార్యక్రమం వలంటీర్లు చేసిన సేవలకు చిరుసత్కారమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు.
- IIలో

న్యూస్‌రీల్

పల్స్‌పోలియో విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరురూరల్: ముందస్తు ప్రణాళికతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని వైద్యాధికారులతో పల్స్‌పోలియో వ్యాక్సినేషన్‌పై శిక్షణ నిర్వహించారు. మార్చి 3వ తేదీన పల్స్‌పోలియో కార్యక్రమం జరుగుతుందన్నారు. 0–5 ఏళ్ల లోపు పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. పోలియో చుక్కల కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో పోలియో నివారణకు అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఓ రవిరాజు, టీబీ అధికారి వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు



ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ చైర్మన్

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలను నిర్వహించారు. వేకువజామున అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేసి, నిత్యకైంకర్యాలు జరిపారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్య అర్చనలు, అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి , ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉభయకర్తలకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు ఉచిత అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

దినకర..శుభకర

కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి ఆలయంలో రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సూర్యజయంతిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారు సప్త వాహనాలపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. వార్షిక బ్రహ్మోత్సవాలను చూడలేని భక్తులు ఈ ఒక్కరోజు బ్రహ్మోత్సవంగా పిలవబడే రథసప్తమి వేడుకల్లో పాల్గొని తరించారు. మలయప్ప దివ్యమంగళ రూపాన్ని దర్శించి పునీతులయ్యారు.



సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన శ్రీనివాసునికి హారతి ఇస్తున్న భక్తులు

తిరుమలలో అంగరంగ వైభవంగా రథసప్తమి వేడుకలు

- సప్త వాహనాలపై శేషాచలాధీశుని వైభవం
- భక్తజనంతో పోటెత్తిన తిరుమల గిరులు
- రద్దీకి అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- నిరంతర పర్యవేక్షణలో టీటీడీ చైర్మన్, ఈఓ, జేఈఓలు

తిరుపతి(అలిపిరి): సూర్యజయంతిని పురస్కరించుకుని అర్ధ బ్రహ్మోత్సవంగా జరుపుకునే రథసప్తమి వేడుకలను తిరుమలలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సప్త వాహనాలపై శేషాచలాధీశుని వైభవాన్ని లక్షలాది మంది భక్తులు తిలకించి పులకించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమలలోని నాలుగు మాడ వీధుల్లో గ్యాలరీలన్నీ నిండిపోయాయి. ఏటా మాఘ శుద్ధ సప్తమినాడు రథసప్తమి వేడుకలు తిరుమలలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

సూర్యప్రభ వాహనం

సర్వలోకాలను చైతన్యాన్ని కలిగిస్తూ ఉదయించే శ్రీ సూర్య భగవానుడు తన కిరణాలను ఉదయం శ్రీవారి పాదాలపై ప్రసరించి అంజలి ఘటించాడు. ఈ అపురూప దృశ్యాన్ని వేలాది మంది భక్తిపారవశ్యంతో తిలకించి పులకించారు. భక్తుల గోవిందనామస్మరణ మధ్య స్వామివారి వాహనసేవ వైభవంగా జరిగింది.

సప్తవాహనా గోవిందా

రథసప్తమి వేడుకల్లో భాగంగా స్వామివారు చిన్న శేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు స్వామి పుష్కరిణిలో చక్రస్నానం వేడుకగా జరిగింది. శ్రీవరాహస్వామివారి ఆలయం వద్ద గల స్వామిపుష్కరిణిలో చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేశారు.

సాంస్కృతిక కళావైభవం

రథసప్తమి వాహనసేవల్లో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 900 మంది కళాకారులు పాల్గొన్నారు. టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్, ఎస్పీ మల్లికా గార్గ్ ఇతర అధికారులు వాహన సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



చిన్న శేష, సర్వభూపాల వాహనాలు
గరుడ వాహనం, చంద్రప్రభ వాహనం
కల్పవృక్షవాహనం, హనుమంత వాహనం
చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు
వాహనసేవల్లో సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న కళాకారులు

ఇంటి ముంగిటకే సంక్షేమం

పుత్తూరు: సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పర్యాటక సాంస్కృతిక యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శుక్రవారం పుత్తూరు రూరల్ మండలం గోపాలకృష్ణాపురంలో సచివాలయ భవనం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం మంత్రికి స్థానిక మహిళలు కర్పూర హారతులిచ్చి, గజమాలలతో ఘనంగా సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. ఇంత అభివృద్ధి కంటి ముందు కనిపిస్తున్నా అభివృద్ధి జరగలేదంటూ ప్రతిపక్ష టీడీపీ నాయకులు మాట్లాడడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, సర్పంచ్ వేలాయుధం, పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు గోవిందస్వామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, మండల కోఆప్షన్ సభ్యుడు రామ్‌బత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆరేటమ్మ ఆలయ ఆర్చీని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

అన్ని ఆలయాలు అభివృద్ధి

నగరి నియోజకవర్గంలోని అన్ని ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి రోజా తెలిపారు. శుక్రవారం పుత్తూరు గ్రామదేవత ఆరేటమ్మ ఆలయ ముఖద్వారం వద్ద రూ.9 లక్షలతో నిర్మించిన ఆర్చిని, రూ.6 లక్షలతో నిర్మించిన పొంగళ్లు పెట్టే షెడ్‌ను ప్రారంభించారు. అనంతరం అమ్మవారి ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, షెడ్ నిర్మాణ దాతలు అనిత, చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు ఏకాంబరం, నరసింహులు, జయలక్ష్మి, రాధ, భానుమతి, నాయకులు లారీమోహన్, చిన్నా, మునిరత్నం, మురళీరాజు, చక్రి పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

బంగారుపాళెం: ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. బంగారుపాళెం మండలం దండువారిపల్లెలో శుక్రవారం జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి స మావేశం ఆ మండలి జిల్లా చైర్మన్ పాలకూరు రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీ మా ట్లాడుతూ రైతు సంక్షేమాన్ని కోరి, ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు మొదలుకుని ఎ రువుల వరకు అక్కడే అందించేలా చర్యలు తీసుకుందని చెప్పారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి మా ట్లాడుతూ జిల్లాలో పెద్ద సంఖ్యలో రైతులు మామిడి సాగుపై ఆధారపడ్డారన్నారు. పంట దిగుబడి వచ్చే లా మామిడి రైతులకు తగిన సూచనలు సలహాలు అందించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడు తూ మామిడికి మంచి ధరలు వచ్చేలా రైతులకు అ వగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్షేత్ర స్థాయిలో సూర్యపటం ఆధారంగా సాగు చేస్తున్న పంటలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఎంపీపీ అమరావతి, సర్పంచ్ అమర, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, డీపీఎం వాసు, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి ప్రభాకర్, ఏపీఎంఐపీ వెంకటరమణారెడ్డి, జిల్లా పట్టుపరిశ్రమ అధికారి శోభారాణి, ట్రాన్స్‌కో ఏస్ఈ శ్రీహరి, డ్వామా ఏపీడీ గంగాభవానీ, జగదీష్‌రెడ్డి, రత్నామ్మ, తిమ్మారెడ్డి, భరత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

క్లుప్తంగా

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్ పర్యవేక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నట్లు ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్‌మౌలా అన్నారు. జిల్లా కేంద్రంలోని డీవీఈఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి రెండో విడత ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమైనట్లు తెలిపారు. 22 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 16వ తేదీన నిర్వహించిన పరీక్షకు 836 మంది విద్యార్థుల కుగాను 806 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీన ప్రాక్టికల్ పరీక్షలు ముగుస్తాయని, మార్చి ఒకటో తేదీన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని డీవీఈఓ వెల్లడించారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు

ఐరాల: ఐదు రోజుల కిందట అదృశ్యమైన ఓ వ్యక్తి బావిలో శవమై తేలిన సంఘటన మండలంలోని నాగంవాండ్లపల్లెలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సంతోష్ గోస్వామి(35) గోవిందరెడ్డిపల్లె సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జ్యూస్ ఫ్యాక్టరీలో కూలీ పనులు చేస్తున్నాడు. ఐదు రోజుల కిందట పనిపై బయటకు వెళుతున్నాని తోటి కూలీలకు చెప్పి వెళ్లాడు. అతడు ఎంతకీ తిరిగి రాకపోవడంతో తోటి కూలీలు చుట్టుపక్కల గాలించిన సంతోష్ గోస్వామి ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో శుక్రవారం నాగంవాండ్లపల్లె సమీపంలోని వ్యవసాయ బావిలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లుగా పోలీసులు గుర్తించారు. తోటి కూలీలకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని పరిశీలించి సంతోష్ గోస్వామిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

COLLECTORATE, CHITTOOR

Roc.No.Coord/434190/2023 Dated: 16.02.2024

SHORT TERM TENDER NOTICE

As per the instructions of the State Election Commission, A.P, Velagapudi, Sealed tenders are invited for the work of **"Supply of other polling Election Material"** for General Elections-2024 HOP/APLA in Chittoor District as per the Schedule shown hereunder.

1. Date of Sale of Tender Schedule	:	From 17.02.2024 onwards
2. Cost of Tender Document	:	Rs.10,000/-
3. Last date for the receipt of Tender Schedule	:	24.02.2024 up to 02.00 P.M
4. Closing of Tender Box	:	24.02.2024 at 02.00 P.M
5. Opening of Tender Box	:	24.02.2024 at 03.00 P.M in the Collector Office, Chittoor

For receiving tender schedule and other details the interested firms shall contact the District Revenue Officer, Chittoor.

JOINT COLLECTOR & ADDITIONAL DISTRICT ELECTION OFFICER,CHAIRMAN, DPC, CHITTOOR

వలంటీర్ల సేవలకు సత్కారం



అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ప్రస్తుతం నిర్వహిస్తున్న వలంటీర్లకు వందనం కార్యక్రమం వారు చేసిన సేవలకు సత్కారమని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీపీ లత ఆధ్వర్యంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి లక్షలాది మంది నిరుద్యోగులకు అండగా నిలిచారని కొనియాడారు. ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి ఇంటి వద్దకే చేరవేయడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని ఆయన చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. అనంతరం సేవావజ్ర అవార్డుకు ఎంపికైన ఇద్దరికి రూ.45 వేలు చొప్పున, సేవారత్న అవార్డుకు ఎంపికైన ఐదుగురికి రూ.30 వేలు చొప్పున, సేవామిత్ర అవార్డుకు ఎంపికైన 218 మందికి సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, కోఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి, చందురాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, ఎంపీడీఓలు సుధాకర్‌నాయుడు, మోహన్‌మురళీ, తహసీల్దార్ పుష్పకుమారి, ప్రత్యేకాధికారి త్రిశూల్ తదితరులు పాల్గొన్నారు

సత్కారం నా అదృష్టం



ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తాం. వలంటీర్‌గా అవకాశం కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాను. పేదలకు సంక్షేమ పథకాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. సేవలను గుర్తించిన ప్రభుత్వం నన్ను మంత్రి చేతుల మీదుగా సత్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

– దేవి, వలంటీర్, విజయమాంబాపురం, కార్వేటినగరం

జగనన్నకు రుణపడి ఉంటాం



ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా పని చేస్తూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. నిరుద్యోగిగా ఉన్న నాకు వలంటీర్‌గా ఉపాధి కల్పించి ఆర్థికంగా ఆదుకుంటున్న జగనన్న ప్రభుత్వానికి మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

– జ్యోత్స్న, వలంటీర్, ఆర్కేవీబీపేట, కార్వేటినగరం మండలం

వైఎస్సార్ సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలోని అనుబంధ విభాగాల కమిటీ సభ్యులను నియమించారు. ఆ వివరాలను పార్టీ కార్యాలయంలో ప్రకటించింది. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా చిత్తూరుకు చెందిన లీనారెడ్డి, ఉపాధ్యక్షులుగా చిత్తూరు, జీడీనెల్లూరుకు చెందిన సి.స్వరూపరాణి, ఎ.గీత నియమితులయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శులుగా పుంగనూరు, కుప్పం, జీడీనెల్లూరు, నగరి, చిత్తూరు, పలమనేరుకు చెందిన వి.సరస్వతమ్మ, ఎస్.ఆర్.మునెమ్మ, యశోదమ్మ, తెన్మొజి, సి.వాణి, శాంతమ్మను నియమిస్తూ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కార్యదర్శులుగా పుంగనూరు, కుప్పం, జీడీనెల్లూరు, నగరి, చిత్తూరు, పలమనేరుకు చెందిన టి.గిరిజమ్మ, టి.మమత, అమరమ్మ, బ్రూమల, ఇందిరమ్మ, ప్రగతి, ఎం.రమ్యారెడ్డి, చంద్రకళ, ఎన్.చిత్ర, సరళ, ఉషారాణి, సౌందర్యమ్మ, సంయుక్త కార్యదర్శులుగా పుంగనూరు, కుప్పం, చిత్తూరు, జీడీనెల్లూరు, నగరి, చిత్తూరు, పలమనేరుకు చెందిన ఎన్.తులసమ్మ, జి.అనసూయమ్మ, జి.ఆదిలక్ష్మి, వి.అనిత, వెంకటరమణమ్మ, ప్రమీల, బి.చెంచమ్మ, ఎం.కోమల, ఎస్.షఫీన్‌బేగం, భారతి, నౌజీయ. గౌరమ్మను నియమించారు.

రైతు విభాగం

రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా జీడీనెల్లూరుకు చెందిన కే.వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులుగా కుప్పానికి చెందిన వెంకట్రామ్‌రెడ్డి, సోమవనరెడ్డి, ప్రధానకార్యదర్శులుగా పుంగనూరు, కుప్పం, జీడీనెల్లూరుకు చెందిన పి.వెంకటరెడ్డి, జె.బలరామిరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కార్యదర్శులుగా పుంగనూరు, కుప్పం, జీడీనెల్లూరు, నగరికి చెందిన కె.రామయ్య, యూ.సుబ్రమణ్యం, జానకీరామ్, నాగభూషణం, మురళీరెడ్డి, గోపీ, ఎలుమలైరెడ్డి, మురళీకృష్ణమనాయుడు, సంయుక్త కార్యదర్శులుగా పుంగనూరు, జీడీనెల్లూరు, నగరికి చెందిన ఎ.నారాయణస్వామి, డీ.కేశవరెడ్డి, కాంతారెడ్డి, సుబ్రమణ్యం, సుధాకర్ కొండేటిని నియమించారు.

ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దాలి



అధికారులతో సమావేశమైన సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: గ్రామ జనాభాలో 50 శాతానికిపైగా దళితులుంటే ఆ ప్రాంతాన్ని పీఎంఏజీవై కింద ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎంఏజీవైను రెండు దశలుగా అమలు చేస్తున్నారని చెప్పారు. ఒక్కొక్క గ్రామాన్ని రూ.21 లక్షల నిధులతో ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దే పనులు చేపడతారన్నారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రణాళికలు రూపొందించి, ఆమోదం పొందిన తర్వాత ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. సమావేశంలో డీపీఆర్సీ డీసీ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆడిట్ ఏఏఓ అహ్మద్ శుక్రవారం సీఈఓ ప్రభాకర్‌రెడ్డిని జెడ్పీ కార్యాలయంలో కలిశారు. 2023–24 ఆడిట్ నిర్వహణకు సంబంధించిన అన్ని రికార్డులను సిద్ధం చేయాలని సీఈఓ ఏఓలను ఆదేశించారు.

వేధింపులపై కేసు నమోదు

పెద్దపంజాణి: ఓ మహిళను తరచూ వేధిస్తున్న వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ చంద్రబాబు తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని పెద్దవెలగటూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన ఓ వివాహితను తరచూ వేధించేవాడు. ఈ క్రమంలో గురువారం ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో ఇంటి వద్దకు వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె అరవడంతో ఆ అరుపులు విన్న గ్రామస్తులు అక్కడికి చేరుకోవడంతో అతడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారం అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కాణిపాకంలో శాస్త్రోక్తంగా రథసప్తమి



కాణిపాకంలో సూర్యనమస్కారం చేస్తున్న అర్చకులు, అధికారులు



పుర వీధుల్లో ఊరేగుతున్న వరసిద్ధుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున మణికంఠేశ్వరస్వామి ఆలయంలోని సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, విశేషాలంకరణలు, పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉదయం స్వామివారి ప్రధాన కార్యాలయంలో ఆలయ అర్చకులు, అధికారులు, రథసప్తమి సందర్భంగా సూర్య భగవానుడికి సూర్యారాధన, సూర్య నమస్కారాలు, ప్రత్యేక పూజలు చేశారు.

పురవీధులలో ఊరేగిన వరసిద్ధుడు

రథసప్తమి సందర్భంగా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి పురవీధుల్లో విహరించారు. ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కాకర్లవారిపల్లెకు చెందిన కీర్తిశేషులు నాధముని నాయుడు కుటుంబ సభ్యులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సార్వత్రిక ఎన్నికల్లో రెవెన్యూ, పోలీస్ అధికారుల కమ్యూనికేషన్ ప్లాన్, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ఇది వరకే రెవెన్యూ అధికారులు పరిశీలించారన్నారు. జిల్లాలోని 1,762 పోలింగ్ కేంద్రాలు 1,266 లొకేషన్లలో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఏఎస్పీ ఆరీఫుల్లా, ఆర్డీఓలు శ్రీనివాసులు, మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా సంతకం.. నా ఓటు.. నా హక్కు!



గెలుపు చిహ్నం చూపుతున్న యువతతో మేయర్, కమిషనర్

చిత్తూరు అర్బన్: నా సంతకం.. నా ఓటు.. నా హక్కు.. నా భవిష్యత్తు అనే నినాదంతో యువత, ఓటర్లు, ఓటుహక్కును విధిగా వినియోగించుకోవాలని చిత్తూరు నగర మేయర్ అముద, ఏఈ ఆర్వో, నగర కమిషనర్ జె అరుణ పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో 'సంతకాలతో ఓటుహక్కుపై చైతన్యం' కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. నా సంతకం.. నా ఓటు.. నా హక్కు అంటూ యువతతో సంతకాలు చేయించారు.

శాస్త్ర విజ్ఞానంపై మక్కువ పెంచే ఇన్‌స్పైర్



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : శాస్త్ర విజ్ఞానంపై విద్యార్థుల్లో మక్కువ పెంచేందుకు ఏటా నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్ పోటీలు దోహదపడతాయని డీఈఓ దేవరాజు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులంతా శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సైన్స్‌తోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమని చెప్పారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధిస్తున్న విజయాల కారణంగా భారత్‌కు ప్రపంచదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఏడీ విజయేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంలో 365 మంది విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. అందులో 36 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులందరికీ జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ చంద్రశేఖర్, జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆరుగురు గంజాయి విక్రేతల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పలమనేరు పోలీసులు

పలమనేరు: విశాఖపట్టణం నుంచి గంజాయి రవాణా చేసి, కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో విక్రయించే ఆరుగురు గంజాయి విక్రేతలను పలమనేరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.50 వేలు విలువజేసే 3 కిలోల గంజాయి, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సీఐ చంద్రశేఖర్ విలేకరులకు వెల్లడించారు. పట్టణ సమీపంలోని చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలో గాంధీనగర్ బస్టాప్ వద్ద ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని, వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో వారు గంజాయిని చిన్న ప్యాకెట్లలో నింపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని విచారించగా పూతలపట్టు నియోజకవర్గం బండపల్లె వడ్డివానికండ్రిగ, చిత్తూరు పట్టణంలోని సంతపేట, మరకంబట్టు, గాండ్లపల్లె, వినాయకపురానికి చెందిన పెరుమాళ్, దిలీప్, శంకర్, శశికుమార్, శరవణ, యాగవగా తేలింది. వీరిలో పెరుమాళ్ గత కొన్నాళ్లుగా విశాఖపట్టణానికి చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయిని కొనుక్కునేవాడని తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం వైజాగ్‌కు చెందిన వ్యక్తి చిత్తూరు రైల్వేస్టేషన్ వద్దకు వచ్చి రెండు కిలోల గంజాయిని రూ.9 వేలకు విక్రయించాడు. దీన్ని పెరుమాళ్ తనకు తెలిసిన పలువురికి అధిక ధరకు విక్రయించాడు. అయితే ఇదే సరుకుని కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో అమ్మితే ఎక్కువ డబ్బు వస్తుందని, వీరంతా కలసి రెండు ఆటోల్లో బయలుదేరి, స్థానిక గాంధీనగర్ వద్ద చిన్న ప్యాకెట్లలో నింపుతూ పోలీసులకు చిక్కారు. ఈ కేసులో వీరితోపాటు వీరికి సరుకును విక్రయించే వైజాగ్‌కు చెందిన కీలకవ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. త్వరలో అతడిని కూడా పట్టుకుంటామని తెలిపారు.

గొల్లపల్లి సిద్ధార్థ కళాశాలలో క్యాంపస్ సెలెక్షన్లు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల చైర్మన్ కొండారెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, సీగొల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్, ఎంబీఏ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించారు. బెంగళూరుకు చెందిన మల్టీనేషనల్ కంపెనీ ఆల్‌సెక్ టెక్నాలజీస్ సంస్థ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, అత్యుత్తమ ప్రతిభ ఆధారంగా 35 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కంపెనీ ఆఫర్ లెటర్స్‌ను ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ఒకేసారి 35 మంది విద్యార్థులు క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కళాశాలలో చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి శిక్షణ కాలంలో రూ.2.26 లక్షలు వార్షిక వేతనం ఉంటుందని, శిక్షణ పూర్తయిన తర్వాత రూ.6 లక్షల వరకు వార్షిక ప్యాకేజీ ఇస్తారని తెలిపారు. రికార్డు స్థాయిలో క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలకు ఎంపిక కావడంలో కృషి చేసిన ప్లేస్‌మెంట్ డైరెక్టర్ స్వామినాథ్, టీపీఓ భాస్కర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సర్కారుకు బ్రాండ్ అంబాసిడర్లు వలంటీర్లు



సేవావజ్రకు ఎంపికైన వలంటీర్ గాయత్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: ప్రభుత్వానికి వలంటీర్లే బ్రాండ్ అంబాసిడర్లు అని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ప్రభుత్వంలో కీలకంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం వారి సేవలను గుర్తించిందన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం వారిని ఏటా సత్కరిస్తుందని చెప్పారు. వలంటీర్ల విశేష సేవలకు గుర్తింపుగా సేవావజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులకు వారిని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వలంటీర్లకు ఉన్న గౌరవం ఏ అధికారి, నాయకునికీ లేదన్నారు. అంతటి గౌరవాన్ని మీకందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి వలంటీర్ రుణపడి ఉండాలన్నారు. వలంటీర్ వ్యవస్థను హేళన చేసి, దొంగలు, బ్రోకర్లు అని అవహేళన చేసిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ మూడు నెలలు వలంటీర్లకు వేతనాలు ఇవ్వకుండా కోర్టుకు వెళ్లి అడ్డుకున్న దౌర్భాగ్యుడు చంద్రబాబు అని మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి వేతనాలు ఇవ్వకూడదని కోర్టు నుంచి ఆదేశాలు వస్తే, తన సొంత నిధులతో వలంటీర్లకు వేతనం అందజేస్తున్న గొప్ప మనసున్న మహారాజు జగనన్న అని కొనియాడారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో అన్ని పథకాలకు లంచం వసూలు చేసి, ప్రజలను దోచుకుంటే, ఈ ప్రభుత్వంలో అవినీతికి తావు లేకుండా నిజాయితీగా పాలన అందిస్తోందిస్తున్నట్లు చెప్పారు. ఇందంతా వలంటీర్ల వ్యవస్థతోనే సాధ్యమైందన్నారు. ఇంతటి గౌరవప్రదమైన వలంటీర్ల వ్యవస్థపై సీఎం జగనన్నకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం సేవావజ్ర, సేవారత్న అవార్డులకు ఎంపికైన గండ్రాజుపల్లె–1 వలంటీర్ గాయత్రి, కలగటూరు వలంటీర్ రజిని, గండ్రాజుపల్లె వలంటీర్ అబ్దుల్‌బాషాను సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచ్ చంద్రమ్మ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గిరిరాజారెడ్డి పాల్గొన్నారు.